# బృహత్కథ

రచన :
ధవళ నాగేశ్వర్

టేబిలుముందు కూర్చుని కథవ్రాస్తున్నాను. ఎవరో గదిలోకి వస్తున్నట్లయింది. కలంక్రిందపెట్టి, వెనుకకు తిరిగిచూశాను. అరవై సంవత్సరాల ముసలతను కర్ర చప్పుడు చేస్తూవస్తున్నాడు. "కథలువ్రాసే నాగేశ్వర్ ... నువ్వేనా ..." అన్నారాయన కొంచం దగ్గరగావచ్చాక.

"అవును నేనే...నా జీవితం ఎప్పుడో సాహిత్యాని కంకితమైపోయింది. ఈ కుర్చీమీద కూర్చోండి...." అన్నా క్రిందకూర్చోబోతున్న ఆయనుద్దేశించి. "అక్కర లేదు నాయనా...." అంటూ నేలమీదే చతికిలబడ్డారు. కర్రను క్రిందపడుకోపెట్టి, పైమీదున్న మాసిన తువ్వాలు మడతలతో ముఖం తుడుచుకుంటున్నారు. సంభాషణ నడిపించడం నాకు చేతకాక ఆలోచిస్తున్నా - నా బుర్రకు అతనెవరో తట్టడంలేదు.

అతనే అందుకుని "నేనెవరా ? అని ఆలోచిస్తున్నావు. అంతేనా ? నాపేరు వైకుంఠం. రిటైర్డు ఎలిమెంటరీ స్కూలు టీచర్ని...." తనని తానే పరిచయం చేసుకున్నారు ....తగినహుంధాలో.

"ఓహో . మీరా...! మీ అమ్మాయిపెళ్ళికి రాలేక పోయాను..." అంటూ కథని డ్రాయర్ లో పడేశాను.

"ఉద్ధరించావ్ .... నామీద అవాకులు చవాకులు కల్పించి ఎందుకు వ్రాశావు ? నేనిలా బ్రతకడం నీకిష్టం లేదా యేం ??...." సూటిప్రశ్న వేశారు వైకుంఠగారు. కవినిరంకుశుడని అతనికి తెలీదుకాబోలు.

"పదహారేళ్ళ మీ పార్వతిని, ఏభై సంవత్సరాల ముసలివాడికిచ్చి పెళ్ళిచెయ్యడం ; ఆమొండిచెయ్యి ముసలి పెండ్లికుమారుడి వద్ద తమరు ఐగువందలు పుచ్చుకోవడం ; ఏమంత సబవుగావున్నాయని .. " ధైర్యంగానే అంటున్నాను.

"ఆగు నాతండ్రీ ! నేను నాకూతుర్ని అమ్మాకున్నంత లోకసాయివాడినైపోయానా...ఇప్పుడు మగరాయుళ్ళను వేల వేలకు అమ్ముతున్న పెద్దలెవ్వారో ...? వాళ్ళకి గడ్డిపెట్టే దమ్ములేవు నీకు ..."

"మీరెన్ని చెప్పండి. మీరు చేసింది ఘోరపాపం. అందుకే నేను కథగావ్రాశాను. నేనిప్పుడు వ్రాసినది కట్నాల సమస్యే...."

"నేను చేసింది పాపమో ; పుణ్యమో నీకేమితెల్సు. అబ్బాయీ ! నన్నడగకుండ నామీద అభాండాలు నిన్నెవరు వ్రాయమన్నారు..." డేమేజీ దావా వేస్తానంటూందాతని ముఖం.

"క్షమించండి...పోనీ యిప్పుడడుగుతున్నాను. శెల వియ్యండి..." నమ్రంగా అడిగేను.

"అలా దారిలోకి రానాయనా ! కాళ్ళీడుచుకుని, యింత దూరం అందుకేవచ్చాను. శాంతంగా విను. అవసరమైతే వ్రాసుకో..." అని ముఖాన్ని ఓమారు భుజంమీదున్న చింకి తువ్వాలుతో తుడుచుకుని ప్రారంభించారు వైకుంఠంగారు.

...."నేను పదిసంవత్సరాల క్రిందట ఎలిమెంటరీ స్కూలు టీచరు గిరీనుండి రిటైరయ్యాను. నామొదటి యిద్దరు కూతుళ్ళకు కష్టపడి ఎలాగో పెళ్ళిళ్ళుచేశాను. అప్పుడు కట్నాలు లేవు కనుక సంబంధాలు మంచివే దొరికాయి. నాయేభైయ్యో పడిలో పార్వతి జన్మించింది. ఆనాడు నేనెంత విచారించానో సర్వేశ్వరుడికి తెలుసు. పుట్టిను నాలుసంవత్సరాలకే తల్లిని దివికి పంపించింది. పార్వతి ఇక నా అవస్థవేరే చెప్పాలా ? రిటైరైనా రాత్రి పగలు ప్రయివేటులు చెబితేనేగాని దినాలు గడిచేవికావు. ముసలికాలంకదూ. ఎన్నాళ్ళు ప్రయివేట్లు చెప్పేశక్తి వుంటుంది. ఐదేళ్ళయింది దృష్టి తగ్గింది. ఇక నాలాంటి వాడి జీవనోపాధికి మూర్గమొక్కటే. నాలుగువీధులూ యాచించి తెచ్చేవాడిని, పాపం ! పార్వతి నాకు ముసలి కాలంలో సంరక్షణ విసుక్కోకుండా చేసేది. నాకడుపున పుట్టి ఏం సుఖపడింది. తన పదేళ్ళనాటినుండి నాకు చాకిరీచెయ్యడంతోనే సరిపోయేది . ." కళ్ళనుండి ప్రవహించే, అశ్రుధారలను తుడుచుకుని, మళ్ళా ప్రారంభించారు వైకుంఠంగారు.

—."ఈరోజుల్లో స్కూలుఫైనలు పోయినవాడికి వెయ్యినూటపదహార్లు కట్నం. నాస్థితి చెప్పానుకదా! నేనెలా పార్వతికి పెళ్ళిచెయ్యగలను? ఏదో దానదృష్టమో, దురదృష్టమో వెంకన్న పంతులు సంబంధం వచ్చింది. దాన్ని కాళ్ళతన్నుకుంటే మరొకటి వస్తుందని నమ్మకమేమిటి? నా యీ స్థితిలో బంధువులు దూరంగా వుంటారని చెప్పక్కరలేదనుకుంటా. పార్వతికి పదహారేళ్ళు నిండాయి. గుమ్మందగ్గర సంస్కర్తలు తచ్చాడుతున్నారు పెళ్ళిచేసుకుందికి ఏ ఒక్కడికి కరేజాలు లేవు. కాని ఏదో కావాలిట. నాయినా! కడుపుకోసం యాచించినా, మానాన్నమ్ముకునే అవినీతికి పాలుపడలేదు. నేనూ ఆలోచించే యీ సంబంధంచేశాను. నాకూతురి శ్రేయస్సు కోరేవాళ్ళు నాకన్నా యింకెవరున్నారు? అమ్మాయికి తిండికి గుడ్డకి లోటుండదు. వర్కుషాపుపనిలో చెయ్యి పోయింది. అప్పటినుండి వాచ్‌మేన్‌గా పనిచేస్తూ, నాల్గురాళ్ళు సంపాదిస్తున్నాడు. వయసులో పెద్దవాడేమరి. చిన్నవాడెలా దొరుకుతాడు చెప్పు. ఏదో దానినో అయ్యకప్పగించాను కనుక నిశ్చింతగా నిద్రపోతున్నాను.."

"మీరు చెప్పేవి వింటూవుంటే జాలికల్గుతోంది. కాని మీరు వెంకన్నపంతులు దగ్గర ఐదువందలు పుచ్చుకోడంలో, ఎంతైనా స్వలాభంకనబడుతోంది.." అన్నాను.

"నిజమే! కీడెంచిమేలెంచాలి. అతడుగుటుక్కుమన్నాడంటే, దానిగతేం కావాలి? ఆ సొమ్ములో దమ్మిడీయేనా నేను ముట్టానా? అంతా దానిపేర బ్యాంకిలో వేయించాను. లోకం నన్ను దూషిస్తోంది. 'ముసలివాడికిచ్చి దానిజీవితం నాశనం చెయ్యకపోతే, ఏనూతులోనో గోదులోనో త్రోసికూడదూ..' అంటోంది పక్కింటి సూరమ్మ. అలాచేస్తే దాని జీవితం బాగు చేసినట్లవుతుంది కాబోలు. ముసలాడ్ని... ఎక్కువగా మాట్లాడలేను. నామీదమాత్రం అన్యాయంగా కల్పించి వ్రాయకు.." అంటూ బరువుగాలేచి, మెల్లగా నిష్క్రమించారు వైకుంఠంగారు.

నలభయ్యో నెంబరు కనకాంబరంరంగు చీరకట్టుకుని వస్తోంది ఓజవ్వని. బహుశాః పార్వతై వుంటుంది. దగ్గరకు వచ్చాక "ఏం? పార్వతీ! మీ నాన్న యిప్పుడే వెళిపోయారు.." అన్నాను.

"సరేకాని.. మీరు నేనాత్మహత్య చేసుకున్నానని ఎందుకు వ్రాశారు? నన్నవమానపర్చడం మీకు న్యాయమేనా?.." దీనంగా ప్రశ్నిస్తోంది పార్వతి.

"బలవంతంగా మీ నాన్న నిన్ను ముసలాడికి కట్టబెడితే, నీకు ఆత్మహత్య చేసుకోవాలని బుద్ధిపుట్టలేదూ?" క్రాస్ ఎగ్జామిన్ చేసేను.

"మీరెంత కఠోరంగా మాట్లాడుతారండి. మా నాన్న నాకు బలవంతంగా పెళ్ళిచెయ్యలేదు నే నొప్పుకున్నాకే చేశాడు. నాకోసం అష్టకష్టాలుపడిన మా నాన్న సుఖంగా ప్రాణాలు విడవడమే నేను కోరేది. నాకిప్పుడు సుఖంగానే వుంది. మా నాన్నకు విచారం తీరిందికదా అని సంతోషిస్తూంటే; మీరు నేను కష్టాలుపడలేక నూతులోపడి ఆత్మహత్య చేసుకున్నానని వ్రాశారు. ఎంత అన్యాయం తలపెట్టారండి. ఏపాపము యెరుగని నేనా దొరికాను మీకు. చనిపోతే, మళ్ళాజన్మలో యింతకన్నా సుఖపడతానని గ్యారంటీ ఏమిటి? అలాంటి పాడుదేశాలు నాకులేవే.." పాత్రల్ని ఖూనీచేస్తే దెయ్యాలై పీడిస్తారని నాకు గట్టి నమ్మకమే కలిగింది. మతిపోతున్నట్లనిపించింది. ఎలాగో నచ్చచెబుదామని.. "కథనలా ట్రేజడీచేస్తేనే రక్తి కడుతుంది ఈరోజుల్లో సతీసావిత్రి సక్కుబాయి.. కథల్లాగ వ్రాస్తే, ఎవడు చదువుతాడు. కథ చదివిన తర్వాత పాఠకుడు కష్టాల కడలిలో పార్వతిని తల్చుకుంటూ వాపోతాడు. అప్పుడే సంఘంలో సంస్కరణకి అవకాశంవుంటుంది. విప్లవం బయలుదేరుతుంది.." అని నాసోదె ఏకరవుపెడుతున్నాను.

ఇంతలోకి "..పారూ!.." అంటూ బాణంలాగ దూసుకువచ్చేడు వెంకన్నపంతులు. వాచ్‌మేన్‌కదూ కాకీ యూనిఫారం. తెల్లగా ముగ్గుబుట్టలాంటి తల. పంతలు భ్రుకటిని పైకెత్తి, మీసంమెలివేశాడు. అతనికో చెయ్యిలేదు కనుక ధైర్యంగా నిలబడ్డాను.

"నువ్వు ఏమన్న పెద్దమనిషివయ్యా! నాగుఱించం తలా కల్పించి వ్రాశావ్.." మొదలుపెట్టాడు పంతులు.. "నాకూ మానసిక ప్రవృత్తున్నాయి. వర్కుషాపులో పనిచేస్తున్నప్పుడు, మీదనుండి 'క్రయిన్' పడి నా చెయ్యిపోయింది. నాకప్పుడు యిరవై రెండు సంవత్సరాలు. వెయ్యి రూపాయిలు 'కాంపన్‌శేషన్' యిచ్చి, వాచ్‌మేనుగా బదిలీచేశారు. నాకింతవరకూ మొండివాడి

నని ఎవరూ పిల్లనివ్వలేదు. ఒక చెయ్యిలేనంతమాత్రానికి పెళ్ళిచేసుకునే అర్హతలేదుకాబోలు. వైకుంఠం స్థితి చూశాక నాకు జాలికల్గింది. పార్వతిని యిమ్మని అడిగాను. తండ్రి కూతురు అంగీకరించారు. పెళ్ళిచేసుకున్నాను. నేను మీలాగ కట్నానికమ్ముడు కాలేదు. ఐదువందలిచ్చి మరీ తెచ్చుకున్నాను పార్వతిని. మేమిద్దరం సుఖంగావుండడం నీకిష్టలేదేమిటి? మాట్లాడవేం?..'' అని గర్జించాడు వెంకన్నపంతులు.

.. "నేనేకాదు ప్రపంచమంతా కోడై కూస్తోంది. కథకుడ్నికాబట్టి వ్రాశాను. మీరు బాధపడనక్కరలేదు. స్టాంపు అంటించమరచి పోస్టుచేశాను. తిరిగివచ్చేస్తూవుంటుంది. దాన్ని మీ ఎదుటే చించేస్తాను" .. అని సమాధానపర్చాను.

"పదవే పారూ! ఆ కథ పబ్లిష్‌కాని వీడిభరతం పడతా.." అని పార్వతితోసహా వెంకన్నపంతులు వెళ్ళిపోయాడు.

నేనొక వేడినిటూర్పువిడిచి, కుర్చీలోకూలబడ్డాను .. "అంత సీరియస్‌గా ఆలోచిస్తున్నావు .. లవ్ స్టోరీ వ్రాస్తావేమిటి?" అన్నకొండయ్య మాటలు విని తలపైకెత్తాను.

"బ్రదర్! ప్రేమకథ లేవడికి కావాలి. చూడు నాగరికత పెరుగుతున్నా, సంఘంలో ఎంతకుళ్ళువుందో. ఆ ముసలి వైకుంఠంగాడు కూతుర్ని ఐదువందలకు అమ్మేశాడుట. 'సోషలిష్టిక్ పేట్రన్ ఆఫ్ సొసైటీ'లో కూడ, యిటువంటి రాతియుగపు చర్యలున్నాయంటే సిగ్గుసిగ్గు. వాస్తవికతను చిత్రిస్తేనే రచయిత పురోగమించగలడు. దీన్ని ఒకకథగా వ్రాయి. అప్పుడు ఆంధ్రదేశంలోనీ కొకస్థానం. నీకు స్నేహితుడిగా నాకోస్థానం లభిస్తాయి.." అంటూ ఉపన్యాసం ప్రారంభించాడు కొండయ్య. డ్రాయర్‌లోని కథను పైకి తీశాను.

.. "నేనసలు కథలు వ్రాయదల్చుకోలేదు .." అంటూ టేబిలుమీదనున్న కాగితాలను 'ఫర్రు'న చించేశాను.

"ఏమిటండీ కలవరింతలు .. నిక్షాపంలాంటి చీరను చింపేశారు .." అని మా ఆవిడనగానే ఉలిక్కిపడ్డాను.

.. ఏవో పీడకల. పాతచీరేగా.

---


ఆరోగ్య
సౌభాగ్యములకు



స్త్రీల ప్రత్యేకమైన జబ్బులు. హిస్టీరియా, మలబద్ధకము తలనొప్పి, వెన్నునొప్పి మొదలగు వాటి కిది వర ప్రసాదము.

వివరములకు
కేసరి కుటీరం ప్రైవేట్ లిమిటెడ్
మద్రాసు 14.
తెలుగు జిల్లాలకు ఏజెంట్లు:
శ్రీ సీతారామ జనరల్ స్టోర్సు (ఏజన్సీస్)
బెజవాడ.